జోగినపల్లి భాస్కర్‌రావు సమాజసేవ ఆదర్శనీయం

చినజీయర్‌స్వామి

సిటీబ్యూరో, మే 18(నమస్తేతెలంగాణ): ఎన్కెపల్లిలోని జేబీ గ్రూపు వ్యవస్థాపకులు జోగిన్‌పల్లి భాస్కర్‌రావు జయంతిని భాస్కర్ మెడికల్ కాలేజీలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్‌స్వామి ముఖ్యఅతిథిగా హాజరై భాస్కర్‌రావు సామాజిక సేవ ఔన్నత్యాన్ని, స్థిత ప్రజ్ఞతను గుర్తు చేశారు. 1988లో వరుణయాగం చేసి రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని ఆశించారని, భాస్కర్‌రావు కుటుంబ సభ్యులు వారి అడుగుజాడల్లో నడుస్తూ విద్య, వైద్య అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని స్వామీజీ అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సంస్కృత, తెలుగు, తమిళ భాషా పండితుడు సాతలూరి గోపాలకృష్ణమాచార్య స్వామివారిని, మాజీ ఎంపీ, విద్యావేత్త గోకరాజు గంగరాజును నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అహోబిల రామానుజ జీయర్‌స్వామిజి, దేవనాథ జీయర్ స్వామి, నేపాల గోపాల కృష్ణమాచార్యలు పాల్గొని హిందూధర్మపురాణాల విశిష్టతను గొప్పగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రావు సతీమణి వసుమతిదేవి, కుమారులు జేవీ కృష్ణారావు, వంశీధర్, కుమార్తె డా.బీ దీపిక, అల్లుడు రామ్మోహన్‌రావు, కోడలు ప్రో.గాయత్రి, మనుమలు, మనుమరాండ్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కేసులో..

- నిందితులపై నాన్ బెయిలబుల్ కేసు
- 'నమస్తే' కథనాలపై స్పందించిన అధికారులు
- బంజారాహిల్స్ పీఎస్‌లో తహసీల్దార్ ఫిర్యాదు

బంజారాహిల్స్,మే 18: నగరం నడిబొడ్డున రూ.300కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తూ పలుమార్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్న కబ్జాదారులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నెంబర్ 403/పీ లోకి వచ్చే టీఎస్ నెంబర్ 1/పి, బ్లాక్-హెచ్, వార్డు-10లో 5 ఎకరాల స్థలాన్ని కాజేసేందుకు బోగస్ పత్రాలను తయారు చేసిన పరుశరామ్ పార్థసారథి, అతడి కొడుకు విజయ్‌భార్గవ్ తదితరులు గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్థసారథి మీద గతంలో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రెండు క్రిమినల్ కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చాడు.కాగా ఫిబ్రవరిలో సైతం అతడి అనుచరులు సంబంధిత స్థలం లోపలికి ప్రవేశించి గది నిర్మించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్థలం తమదేనంటూ దౌర్జన్యానికి దిగడంతో మరో కేసు నమోదయిన సంగతి తెలిసిందే.

బంజారాహిల్స్ రోడ్ నెం 10లో ప్రభుత్వ స్థలానికి బిగించిన గేటు. (ఇన్‌సెట్‌లో) కబ్జాదారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన దృశ్యం

హెచ్చరిక బోర్డుల తొలగింపు..

కాగా ఇటీవల మరోసారి పార్థసారథితో పాటు అతడి అనుచరులు 5ఎకరాల స్థలం బయట ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగించడం, లోపలివైపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు వ్యక్తులు నిఘా పెట్టిన వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలపై షేక్‌పేట్ మండల తహసీల్దార్ అనితారెడ్డి స్పందించారు. ఈనెల 16న రెవెన్యూ సిబ్బంది స్థలం వద్దు చేరుకుని ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలను తొలగించారు. రెవెన్యూ సిబ్బంది వెళ్లిపోగానే అదేరోజు రాత్రి మరోసారి బోర్డును తుడిచివేశారు. దీంతో శనివారం మరోసారి అక్కడకు చేరుకున్న రెవెన్యూ సిబ్బంది బోర్డులను రాయించడంతో పాటు గేటును సీజ్ చేసి తాళాలు వేశారు.

బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు..

కాగా ఎన్నిసార్లు హెచ్చరించినా పార్థసారథి, విజయ్‌తో పాటు వారి అనుచరులు పద్ధతి మార్చుకోకపోవడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని.. సుమారు రూ.300కోట్ల విలువైన స్థలాన్ని తమ స్థలంగా చూపిస్తూ జనాన్ని మోసం చేసేందుకు యత్నిస్తున్నారని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు పార్థసారథి, విజయ్‌తో పాటు స్థలంలోకి ప్రవేశిస్తున్న అనుచరులపై బీఎన్ఎస్ 329(3), 111(4), 221,352, 322, 324(2), 62 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా ప్రభుత్వస్థలాన్నికాజేసేందుకు ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్న నిందితులపై ఆర్గనైజ్డ్ క్రైంగా బీఎన్ఎస్ 111(4) సెక్షన్ నమోదు చేయడం విశేషం.

దటీజ్ కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను వివరించడానికి ఆదివారం నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన డ్రోన్ షోలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను ప్రదర్శించారు. అయితే ఏ నిర్మాణాన్ని రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందర విమర్శించారో.. అదే నిర్మాణానికి దండం పెడుతూ ఉన్నట్టు రేవంత్ రెడ్డి ఫొటో ఉంది. ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దటీజ్ కేసీఆర్ అంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. విమర్శించనోళ్లు కూడా కేసీఆర్ విజన్‌కు దండం పెట్టాల్సిందేనంటూ పేర్కొన్నారు.

- సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ):

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

జయదర్శిని కాలనీలో మంచినీటి సరఫరా పంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- కొంపల్లి జయదర్శినిలో మంచినీటి సరఫరా ప్రారంభం

కుత్బుల్లాపూర్, మే 18: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయదర్శిని ఎన్‌క్లేవ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన మంచినీటి సరఫరాను ఆదివారం ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, వెలుస్తున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా జయదర్శిని ఎన్‌క్లేవ్ నందు నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించామని ఎమ్మెల్యే తెలిపారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా..

2023 సంవత్సరంలో జరిగిన ఎన్నికల ప్రచారాన్ని తాను మొదలుపెట్టింది ఇక్కడి నుండేనని, మీ అందరూ నన్ను నిండు మనసుతో ఆశీర్వదించి మెజార్టీతో గెలిపించినందుకు కుత్బుల్లాపూర్ ప్రజానీకానికి ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. జయదర్శిని ఎన్‌క్లేవ్ నందు మంచినీటి కటకట సమస్య తీవ్రంగా ఉండేదని ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమైందని అన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు వెల్ఫేర్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, నాయకులు దేవేందర్ యాదవ్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్ రావు, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిమహేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ చిన్నారెడ్డి, కోశాధికారి కృష్ణకిషోర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం

మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్

బాలకిషన్ నివాసంలో సమావేశమైన మానసంఘాల ప్రతినిధులు

ఆర్కేపురం, మే 18: మాల కులస్తుల డిమాండ్లను పట్టించుకోకుండా ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఏకపక్ష నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని తెలంగాణ మాల సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ నివాసంలో ఆ సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకులు రావుల అంజయ్య, చెరుకు రామచందర్, మందాల భాస్కర్ భీమ్ సేన అన్న, పూసల వెంకటేశం, చేపూరి నర్సింహ, రిటైర్డ్ తహసీల్దార్ గంగాధర్, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా బ్యాగరి కాటికాపరివృత్తులు సంఘం అధ్యక్షుడు తునికి పద్మాకర్‌తో కూడిన ప్రతినిధి బృందం పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో మాలల ఉనికి లేకుండా చేయాలని చేస్తున్న కుట్రదారులకు వ్యతిరేకంగా సభలు, సమావేశాల ద్వారా మాల ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. వర్గీకరణ వల్ల మాల యువకుల జీవితం సర్వనాశనం అవుతుందని.. ఈ విషయంపై తెలంగాణకు చెందిన తొమ్మిదిమంది మాల శాసనసభ్యులు ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఏకపక్షంగా ఎస్సీలను వర్గీకరించారని, సుప్రీంకోర్టు చెప్పిన విధంగా టెంపరేచర్ డాటా కాకుండా క్రిమిలేయర్ కాకుండా అడ్డగోలుగా లెక్కలు చూపి మాలలను అన్యాయం చేశారని ఆరోపించారు.

హామీలను అటకెక్కించిన సర్కార్

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, మే 18: ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తీవ్రంగా విఫలమైందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. ఆదివారం కందుకూరు మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అటకెక్కించినట్లు వివరించారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా.. కోటి మహిళలను కోటీశ్వరులను చేస్తానని చెప్పిన వాగ్దానం సహా అన్నిటిని విస్మరించారని తెలిపారు. ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని సబిత ఆరోపించారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. పదవులను కాపాడుకోవడానికి ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యల పరిష్కారంపై లేదని అన్నారు. రుణమాఫీ, రైతుబంధు, మహిళకు కల్యాణ లక్ష్మి, తులం బంగారం, స్కూటీ వంటి హామీలను తుంగలో తొక్కారని అన్నారు.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో కూడా ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని సబిత ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ నాయకులకు ఇందిరమ్మ ఇళ్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. పాలన చేతకాక సీఎం, మంత్రులు ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. పాలనపై దృష్టి పెట్టి ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, దేవిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ జంగయ్య, సురసాని సుదర్శన్ రెడ్డి ,సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్ రెడ్డి, కార్యాలయ కార్యదర్శి బర్కం వెంకటేశ్, సామయ్య, బడంగ్‌పేట్, మీర్‌పేట్ అధ్యక్షులు రామిరెడ్డి, కామేష్ రెడ్డి, గణేశ్ రామానుజన్, తేజ నాయక్ , వినోద్ పాల్గొన్నారు.

కందుకూరులో కార్యకర్తలతో ఎమ్మెల్యే సబితారెడ్డి

కాప్రా చీర్యాల వ్యవసాయక్షేత్రంలో రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు

చిరస్మరణీయుడు రాజిరెడ్డి

ఉప్పల్, మే 18: చిర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బండారి రాజి రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆదివారం హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్, కౌకొండ జగన్, బింగి శ్రీనివాస్, బాలు, పుష్ప రాజ్ శ్యామ్ , శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

వీఎస్‌టీ పార్కుకు రాజిరెడ్డి పేరు..

నాచారం డివిజన్ పరిధిలోని వీఎస్‌టీలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీ పార్క్‌కి బండారి రాజిరెడ్డి వీఎస్‌టీ పార్క్‌గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి సేవలను నాయకులు కొనియాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

నే తన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే

అందాల పోటీలా..!

నూలుపై సబ్సిడీని జమ చేసి.. రుణమాఫీ అమలు చేయాలి

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం..

చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు

మున్సురాబాద్, మే 18: జీవనోపాధి కరువై నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా అందాల పోటీల్లో మునిగితేలుతుందని మాజీ ఎమ్మెల్సీ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. మున్సురాబాద్ డివిజన్, సహారాస్టేట్స్ కాలనీలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత కార్మికులు పొద్దంతా పనిచేసినా పూటగడవక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆదుకోక పోగా కోట్లు ఖర్చుచేసి రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. చేనేత రుణాలు మాఫీ చేస్తామని, నూలుపై సబ్సిడీ ఇస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి అమలు కావడంలేదని అన్నారు. నూలు పై సబ్సిడీని వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేసి రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టులో త్రిఫ్ట్ పథకం గడువు ముగిసినా ఇప్పటి వరకు దానిని పునరుద్ధరించలేదని తెలిపారు. జియో టాగ్ ఉన్న నేత కార్మికునితోపాటు ఇద్దరికి అనుబంధ కార్మికులకు కూడా త్రిఫ్ట్ పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. జియో టాగ్ పేరుతో కాలయాపన చేస్తూ నేత కార్మికులను భయాందోళనకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు టెస్కో ద్వారా కొనుగోలు చేయడం తో పాటు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో, పాకిస్తాన్ సైన్యం దాడుల్లో, యుద్ధంలో మరణించిన సైనికులకు, ఈ మధ్య మరణించిన చేనేత కార్మికులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టి రెండు నిముషాలు మౌనం పాటించారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వనం శాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, బడుగు శంకరయ్య, గుండు వెంకటనర్సు, గుర్రం నర్సిం హ, సామలేటి రాజేందర్, చెన్న రాజేశ్, చిదిరాల నారాయణ, పెంటయ్య, శేఖరయ్య, గజం శ్రీశైలం, గంజి రామచంద్రం పాల్గొన్నారు.

చరిత్ర, సంస్కృతిని మరువొద్దు

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు చెర్మన్ వేదకుమార్

తెలుగు యూనివర్సిటీ, మే 18: చారిత్రాత్మక మ్యూజియంలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు చెర్మన్ వేదకుమార్ మణికొండ అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు, తెలంగాణ రాష్ట్ర హెరిటేజ్ డిపార్టుమెంట్, సివిల్ సొసైటీ గ్రూపుల సంయుక్త ఆధ్వర్యంలో గన్‌ఫౌండ్రీలోని సెంటినరి హెరిటేజ్ మ్యూజియంలో ఆదివారం 'ఎ మ్యూజియం డే వాక్' నిర్వహించారు. డిపార్టుమెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వేదకుమార్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే నేషనల్ మ్యూజియం అతి ఉత్తమమైనదన్నారు. కుతుబ్‌షాహి పీరియడ్, అజఫ్‌షాహీ పీరియడ్‌ల వరకు మ్యూజియంలకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం ప్రపంచలోనే గొప్ప మ్యూజియం అని అన్నారు. . చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను చూడటమే కాకుండా వాటి వెనుక ఉన్న నెపథ్యాన్ని, సాంకేతికతను తెలుసుకోవాలని కోరారు.

వినోదం, జ్ఞానం నేర్పిస్తాయి..

తెలంగాణ ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ ద్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. మ్యూజియంలు ప్రజలకు వినోదం, జ్ఞానం నేర్పిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ బాబ్జీ రావు, చరిత్రకారులు సంగన భట్ల నర్సయ్య, శ్యాంసుందర్, స్థపతి శ్యాంసుందర్, అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, అసిస్టెంట్‌డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజి కె.రూపి, సూపరింటెండెంట్ రాజు, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు కోఆర్డినేటర్ ప్రభాకర్, ఇన్‌చార్జి ఖైదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

భూపతిచంద్ర స్మారక అవార్డుల ప్రదానం

పురస్కార గ్రహీతలను సన్మానించిన అతిథులు

తెలుగు యూనివర్సిటీ, మే 18: ఉరుకుల పరుగుల జీవన ప్రయాణంలో కొందరు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని వార్తలు వింటున్న నేటి సమాజంలో భూపతిచంద్ర కుమారులు ఆయన పేరిట స్మారక అవార్డులు అందజేయడం అభినందనీయమని సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి అన్నారు. భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎంఎల్ కాంతారావు అధ్యక్షతన ఆదివారం అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో 'భూపతి చంద్ర' స్మారక కథానికల ప్రధానోత్సవ సభ- 2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సంపాదకులు కే. రామచంద్ర మూర్తి, నాగార్జున యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ, ప్రముఖ సినీ దర్శకులు బి.నరసింగరావు హాజరయ్యారు. అనంతరం చాగంటి ప్రసాద్ రచన 'తీరని రుణం ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి 'అనుకోని అతిథి' రచయిత ఉప్పులూరి మధుపత్ర శైలజకు, తృతీయ బహుమతికి కర్రెకోడి రచించిన కొండ మల్లారెడ్డికి ప్రదానం చేశారు. ప్రోత్సాహక పురస్కారాలను సమీద (ఎం. శ్రీనివాసరావు), వెన్నెల రాగం (గొర్లివాని శ్రీనివాస్), సాగని పయనం (వాసవ దత్తర మణ), శారదా విజయం (ఎస్ గంగలక్ష్మి), ఏది ముఖ్యం (పప్పు శాంతాదేవి) లకు అందజేసి శాలువతో సన్మానించారు. ప్రొఫెసర్ ఎస్. రఘు తదితరులు హాజరయ్యారు.

కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ గార్గ్

సిటీబ్యూరో, మే18 (నమస్తే తెలంగాణ): చిన్నపిల్లలకు వచ్చే కంటి క్యాన్సర్ గురించి అవగాహన కల్పిస్తూ, చికిత్సకు విరాళాల నిమిత్తం ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని టీ-వర్క్స్ వద్ద తలపెట్టిన ''వైట్‌థాన్ 10-కే రన్‌ను ఆదివారం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ వై నాగిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వైట్‌థాన్ ద్వారా కంటి క్యాన్సర్ గురించి తెలుసుకున్న సమాచారాన్ని మన పరిధిలో ఉన్నవారితో పంచుకోవాలన్నారు. తద్వారా ఎంతో మంది చూపును, ప్రాణాలను రక్షించవచ్చన్నారు. అనంతరం ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారి కంటిని, ప్రాణాన్ని రెటినోబ్లాస్టోమా నుంచి కాపాడాలన్నారు. తమ హాస్పిటల్‌కు ప్రతిఏటా కంటి క్యాన్సర్‌తో 150 నుంచి 200 వరకు కొత్త కేసులు వస్తుంటాయన్నారు. వీరిలో చికిత్స పొందిన కేసుల్లో 90శాతం మంది పిల్లల ప్రాణాలు రక్షించామన్నారు. కానీ కేవలం 45 శాతం మంది పిల్లల దృష్టిని మాత్రమే కాపాడగలిగామన్నారు. సరైన సమయంలో రాకపోవడమే దృష్టి కోల్పోవడానికి కారణమని.. ఆరంభ దశలో చికిత్సతో మెరుగైన ఫలితాలు సాధ్యం అవుతాయన్నారు.

తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలి

తెలంగాణ పరిరక్షణ వేదిక

చిక్కడపల్లి, మే 18: ప్రభుత్వం వెంటనే తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలి. తెలంగాణ సినిమాను ప్రోత్సహించేలా ఆ పాలసీ ఉండాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణ సినిమా రంగం: అభివృద్ధి-అవరోధాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పసునూరి రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సినిమా రంగానికి సంబంధించిన ప్రముఖ దర్శకులు, రచయితలు, ప్రజా ఇనుముల ప్రేమారాజ్, సయ్యద్ రఫీ, ప్రవీన్ చందర్, అశోక్ కుమార్, చల్లా శ్రీనివాస్, అక్షర కుమార్, రమేష్ కిషన్ గౌడ్, తెలంగాణ సినిమా వేదిక గౌరవ సలహాదారులు ప్రఫుల్ రామ్ రెడ్డి, కన్వీనర్ బైరాగి మోహన్ తదితరులు హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్నా నేటికీ తెలంగాణ సినిమా రంగం తీవ్ర వివక్షతకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమా నిర్మాణానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించాలి. తెలంగాణ సినిమాకు పన్ను మినహాయింపులు ఇవ్వాలి. ప్రత్యామ్నాయ సినీ పరిశ్రమను ఏర్పాటు చేసుకునేందుకు తెలంగాణ ఫిలింఛాంబర్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

అమెరికాలోని తెలుగు అసోసియేషన్ (ఆటా) డెట్రాయిట్ చాప్టర్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డెట్రాయిట్ మెట్రో ప్రాంతానికి చెందిన మహిళలు, కుటుంబాలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక వేడుకల్లో పాలుపంచుకున్నాయి. ఆటా అధ్యక్షుడు జయంత్‌రెడ్డి చల్లా, ట్రస్టీల బోర్డు కాశీరెడ్డి కోతా, సన్నీ రెడ్డి, హరిప్రసాద్ లింగాల, అశోక్ గుడి, శ్రీధర్ తిప్పి రెడ్డి, శశి ఎల్లెందుల కార్యక్రమానికి సహకారం అందించగా.. ఆటా మ్యాట్రిమోనీ చైర్ స్వప్న రెడ్డి కల్వ నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో సరోలిత కోట, స్వప్న ముత్యాల, లిఖిత కర్నాల తదితరులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, మే 18(నమస్తే తెలంగాణ):